క్లుప్తంగా

డోలు కళాకారుడికి సన్మానం



ఇలపకుర్తి శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

యలమంచిలి: గుమ్ములూరు గ్రామానికి డోలు కళాకారుడు ఇలపకుర్తి శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులను దిగమర్రు వీరభద్ర స్వామి కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామంలోని శివాలయంలో శ్రీనివాస్‌కు రజత కంకణాన్ని హార్మోనియం కళాకారుడు తమ్మా శివ కోట మార్లింగం తొడిగారు. మేడిచర్ల వెంకట రామారావు, వీరా కోట మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామానికి చెందిన కేతా కనకారాజు (64) ఈ నెల 22న ఆర్థిక బాధలు తాళలేక పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు అతనిని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ఉన్నత వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం సాయంత్రం చనిపోయాడు. ఈ మేరకు మృతుని కుమారుడు కేతా నాని ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు యలమంచిలి ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ

నరసాపురం: పట్టణంలో పలు వార్డుల్లో బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పర్యటించి పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఆయా పనులు లోపాలు లేకుండా పక్కాగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్‌పాత్రుడు, శానిటరీ మేస్త్రి కిషోర్, నరేష్ తదితరులు ఉన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ఎక్సైజ్ పోలీసులు పాలకొల్లు మండలంలో బుధవారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో వెంకటాపురం గ్రామంలో కె.సంజీవి అనే వ్యక్తి బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. ఈ దాడుల్లో ఎస్సైలు పి.మహేష్, జి.రఘు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

నరసాపురం: నరసాపురంలో బుధవారం జరిపిన దాడుల్లో మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా అబ్కారీ మద్యపాన నియంత్రణ అధికారి డాక్టర్ కుమరేశన్ చెప్పారు. ముందుగా రెండు బాటిళ్లతో ఓ వ్యక్తిని అరెస్ట్ చేశామని, అతడు ఇచ్చిన సమాచారంతో పట్టణానికి సమీపంలోని ఓ ఆక్వా ఫారమ్‌లో దాచిన 4,500 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పట్టణానికి చెందిన బి.జయరాజు, కొప్పర్రుకి చెందిన జి.రాజబాబు అక్రమ మద్యం వ్యాపారంలో ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యిందని పేర్కొన్నారు.

చెడుగుడు పోటీలు ప్రారంభం

వీరవాసరం: క్రీడల ద్వారా మానసిక ఉత్తేజం కలుగుతుందని రాయకుదురు గ్రామ సర్పంచ్ గెద్దం భారతి తెలిపారు. రాయకుదురు శివారు జగన్నాథరావు పురంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటల పోటీల వలన యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజాభివృద్ధికి పాటుపడి మంచి లక్షణాలు కలిగి ఉంటారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అద్దాల శ్రీరామచంద్రమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కడలి నెహ్రూ, తోట ఆది బాబు, పంపన రామానంద్ సాగర్ పాల్గొన్నారు.

హరహర మహాదేవ
శంభో శంకర

శివనామ స్మరణతో పులకించిన శివాలయాలు

పాలకొల్లు సెంట్రల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం హరహర మహాదేవ శంభో శంకర అంటూ శివనామస్మరణతో పులకించింది. బుధవారం మహాశివరాత్రి పురస్కరించుకుని భక్తులు వేకువజాము నుంచే స్వామివారిని దర్శించుకోవడానికి క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఆలయ అధికారులు, పోలీసులు పటిష్ఠ ఏర్పాట్లు చేయడం వల్ల తొక్కిసలాట లేకుండా క్యూలైన్లు సక్రమంగా నడిచాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మహన్యాసపూర్వక అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 8.35 గంటలకు జగజ్యోతి వెలిగించారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో స్వామివారికి మల్లన్న పాగా అలంకరించారు. అనంతరం లక్షపత్రి పూజ నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం 6 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. సాయంత్రం 5 గంటల సమయంలో స్వామివారికి అలంకరించే మల్లన్న పాగాను పల్లకిలో ఊరేగించారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. క్యూలైన్లో భక్తులు కళాక్షేత్రం వరకూ వేచిఉన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, పట్టణ సీఐ కె.రజనీకుమార్, ఎస్సై పృథ్వీ, సచివాలయ ఉమెన్ ప్రొటెక్షన్ సభ్యులు, వివిధ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సేవలను అందించారు. ఆలయం ప్రాంగణంలో కొందరు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు భక్తులకు ఉచిత ప్రసాదం, అన్నదానం ఏర్పాటు చేశారు. పట్టణంలోని మఠంవీధిలో కొలువై ఉన్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ఆలయంలో శివరాత్రి పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఆలయ ప్రాంగణం వద్ద నిప్పుల గుండం ఏర్పాటుచేశారు. క్షీరారామలింగేశ్వరస్వామిని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కవురు శ్రీనివాసు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి తదితరులు దర్శించుకున్నారు. అలాగే పట్టణంలోని లాకుదిగువ కొత్తపేటలో కొలువై ఉన్న శ్రీ భద్రకాళీ వీరభద్ర స్వామి కళ్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆన సంబరం ప్రారంభించారు. మధ్యాహ్నం 2 గంటలకు పట్టణ పురవీధుల్లో స్వామి వారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు.



యలమంచిలి: మేడపాడులో పుష్పాలంకరణలో ఉమారామలింగేశ్వరస్వామి



పాలకొల్లు సెంట్రల్: క్షీరా రామలింగేశ్వరుని సన్నిధిలో అభిషేకం కోసం మహన్యాసంలో కూర్చున్న భక్తులు

పోడూరులో..

పోడూరు: మండలవ్యాప్తంగా అన్ని శైవక్షేత్రాల్లో బుధవారం శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువజాము నుంచే శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. జిన్నూరులోని శ్రీ అన్నపూర్ణేశ్వరి ఆలయంలో కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నిర్వహించిన అన్న సంతర్పణలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ జమ్ము మృత్యుంజయరావు (బుజ్జి), కమిటీ సభ్యులు, నవయువత యూత్ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నరసాపురంలో..

నరసాపురం: మహా శివరాత్రి పర్వదినాన్ని బుధవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే శివాలయాలు కిటకిటలాడాయి. ప్రసిద్ధ కపిలమల్లేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామునుంచే అభిషేకాలు నిర్వహించారు. భక్తులు బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వాసవిక్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు నూలి శ్రీనివాస్ పర్యవేక్షణలో భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. అలాగే గోదావరి తీరంలో ఉన్న అమరేశ్వరస్వామి ఆలయం కూడా భక్తులతో కిక్కిరిసింది. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు గోదావరి స్నానం ఆచరించి శివ దర్శనం చేసుకున్నారు. శివాలయాల్లో అర్చకులు పంచామృతాభిషేకాలు శాస్త్రోక్తంగా చేశారు. మేడపాడు గ్రామంలో శివాలయార్చకులు బాదంపూడి చిరంజీవి శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున శ్రీఉమా సమేత రామలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పుష్పాలతో దేవేరులను అత్యంత సుందరంగా అలంకరించారు.



పాలకొల్లు సెంట్రల్: మాడ వీధుల్లో పల్లకిలో మల్లన్న పాగాను ఊరేగిస్తున్న దృశ్యం



పోడూరు: జిన్నూరులో అన్నపూర్ణేశ్వరి ఆలయం వద్ద అన్నసంతర్పణలో పాల్గొన్న భక్తులు



నరసాపురం: కపిలమల్లేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు

వైభవంగా శివకల్యాణాలు, రథోత్సవాలు

పెనుమంట్ర: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని త్రిలింగ క్షేత్రాలుగా పేరుగాంచిన నత్తారామేశ్వరం, జుత్తిగ, మల్లిపూడి గ్రామాల్లో ఉన్న శ్రీఉమా రామలింగేశ్వరస్వామి, శ్రీఉమాసోమేశ్వర స్వామి, శ్రీఉమా అగస్త్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు తెల్లవారు జామున అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. నత్తారామేశ్వరంలో శ్రీఉమా రామేశ్వర స్వామికి ప్రవాస భారతీయులు తాతకుంట్ల ఎల్లారీశ్వరరావు, వసుంధరాదేవి దంపతులు కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు భక్తులు పెద్ద ఎత్తున అభిషేకాలను నిర్వహించారు. నత్తారామేశ్వరం, జుత్తిగ గ్రామాలలో దాతలు ఏర్పాటు చేసిన అఖండ అన్నసమారాధనలో భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. జుత్తిగ సోమేశ్వరస్వామి ఆలయంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెల్లవారు జామున స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ జుత్తిగ గ్రామంలోని సోమేశ్వరస్వామివారిని దర్శించుకుని అక్కడ జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం నత్తారామేశ్వరం గ్రామంలో శ్రీరామేశ్వరస్వామి వారి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మణేశ్వర ఆలయ ఆవరణలో దాతలు ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో సత్యసాయి సేవా సమితి వలంటీర్లు భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. ఆలయ ఆవరణలో ద్వారంపూడి వీర సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రసాదాన్ని భక్తులకు అందించారు. మధ్యాహ్నం మూడు గ్రామాల్లో కూడా రథోత్సవాలు వైభవంగా నిర్వహించారు. నత్తారామేశ్వరంలోని రామేశ్వర స్వామికి, జుత్తిగలోని సోమేశ్వరస్వామికి, గ్రామ పొలిమేరలలో సాయంత్రం ఎదురుసన్నాహ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.



జుత్తిగలో సోమేశ్వరస్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు





నత్తారామేశ్వరంలో శివయ్య దర్శనానికి బారులు తీరిన భక్తులు, రామలింగేశ్వరుని రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



జుత్తిగలో సోమేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ఆచంటేశ్వరుని దర్శనానికి
పోటెత్తిన భక్తులు



ఆచంటలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఆచంటేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు



వాసవీ శాంతి ధాంలో చక్కెరతో అభిషేకం చేస్తున్న దృశ్యం

పెనుగొండ: మహాశివరాత్రి పురస్కరించుకుని ఆచంటేశ్వరుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. బుధవారం తెల్లవారు జాము నుంచి శివనామస్మరణతో ఆచంట మండలంలో శివాలయాలు హోరెత్తాయి. ఆచంటేశ్వరునికి ఆలయ అర్చకులు తెల్లవారు జాము నుంచి నిరాటంకంగా అభిషేకాలు కొనసాగిస్తూనే ఉన్నారు. భక్తులు సాయంత్రం నాలుగు గంట వరకూ బారులు తీరారు. ఆచంట శాసన సభ్యుడు పితాని సత్యనారాయణ దంపతులు ఆచంటేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాదిగా వచ్చిన భక్తులకు రామేశ్వరస్వామి సత్రంలో అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆచంటేశ్వరునికి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి సత్యనారాయణ, ఈఓ ఆదిమూలం వెంకట సత్యనారాయణలు ఏర్పాట్లు చేయగా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెనుగొండ సీఐ రాయుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వెంకటరమణ బందోబస్తు నిర్వహించారు.

పెనుగొండ మండలంలో

స్థానిక శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు కోట వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నగరేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి వేడుకగా రథోత్సవం నిర్వహించారు. సిద్ధాంతం నందీశ్వర స్వామి, కేదారేశ్వర స్వామిల దర్శనానికి భక్తులు పోటెత్తారు. వశిష్టా గోదావరిలో పుణ్య స్నానాలు చేసి స్వామి వారి దర్శనం చేసుకున్నారు. వడలి అగస్త్యేశ్వర స్వామి, ఇలపర్రు నీలకంఠేశ్వర స్వామి వార్లను దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలి వచ్చారు.

వాసవీ శాంతి ధాంలో టన్ను చక్కెరతో అభిషేకం

స్థానిక వాసవీ శాంతి ధాం ద్వాదశ జ్యోతిర్లింగ మందిరంలో నగరేశ్వరునికి టన్ను చక్కెరతో అభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ స్వామిజీ(బాల) పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ అభిషేకాలు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

నరసాపురం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో బుధవారం ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ రాజరాజేశ్వరి పర్యవేక్షణలో సామగ్రి పంపిణీ చేశారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆర్డీఓ తెలిపారు. సిబ్బంది సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నరసాపురంలో టేలర్‌హైస్కూల్ వద్ద పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద మాట్లాడుతూ పోలింగ్ పక్రియ శాంతియుతంగా సాగేలా తగిన బందోబస్తు ఏర్పాటుకు చర్యలు చేపట్టామని చెప్పారు.

ఆచంటలో..

పెనుగొండ: ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఆచంటలోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ దాసిరాజు పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఆచంటలో 1895 ఓటర్లకు గాను పురుషులు 1161 మంది, మహిళలు 734 మంది ఉన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెనుగొండలో

ఎమ్మెల్సీ ఎన్నికలకు పెనుగొండలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దారు జి.అనితకుమారి తెలిపారు. మండలంలో 2523 ఓట్లు ఉండగా 1410 మంది పురుషులు, 1113 మంది మహిళలు ఉన్నారన్నారు. వీరి కోసం మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలో ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 2133 మంది ఓటర్లు ఉండగా, 3 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పెనుమంట్ర సచివాలయం పరిధిలో బ్రాహ్మణచెర్వు యూపీ పాఠశాలలో 408, 409, పెనుమంట్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో 410 నంబర్లతో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల అధికారి తహసీల్దార్ వై.రవికుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఓటర్లకు అందజేసిన స్లిప్‌ల ప్రకారం ఆయా పోలింగ్ బూత్‌లకు వెళ్లి తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యలమంచిలిలో..

యలమంచిలి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. మండలంలో మొత్తం 2722 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని, వీరందరికీ స్థానిక నెంబర్ 1 ప్రాథమిక ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని వివరించారు. పోలింగ్ సిబ్బంది అందరూ పోలింగ్ కేంద్రాలు చేరుకున్నారని పేర్కొన్నారు.

పాలకొల్లులో..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పాలకొల్లులో 10 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యడ్లబజార్ సెంటర్‌లోని ఎంఎంకేఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో నాలుగు, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న బీఆర్‌ఎంవీ హైస్కూల్‌లో నాలుగు, బ్రాడీపేటలో ఉన్న ఏవీఎస్‌ఎన్‌ఎం హైస్కూల్‌లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. పాలకొల్లులో సుమారు 7900 ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు.



నరసాపురం: ఎన్నికల సామగ్రితో సిబ్బంది వాహనాన్ని పంపిస్తున్న అధికారులు



యలమంచిలి: పోలింగ్ సామగ్రిని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఉత్సాహంగా ప్రభల సంబరం



సిద్ధాంతంలో ప్రభల సంబరం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం సాలిపేటలో శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వారి శివరాత్రి ప్రభల సంబర మహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి శ్రీ స్వామివార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఐశెట్టి సుబ్రహ్మణ్యం, హేమ నాగమణి దంపతులతో శ్రీ వీరభద్ర స్వామి వారి ప్రభకు విభూది తాంబూలం కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖండవల్లి వారి కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకర్షించింది.